
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 13.4
ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 29 జనవరి 2025



ఆదివాసీ గిరిజన సంస్కృతికి నిదర్శనం..

కేస్లాపూర్ నాగోబా జాతర

- అర్ధరాత్రి పవిత్ర గంగజలాలతో మెస్రం వంశీయుల మహాపూజలు
- అంగరంగ వైభవంగా ప్రారంభమైన నాగోబా జాతర
- హాజరైన జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు

7




మంగళవారం అర్ధరాత్రి 12గంటలకు నాగోబా దేవతకు మహాపూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



నాగోబాకు మహా హారతి ఇస్తున్న దృశ్యం



హాజరైన కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్‌జాదవ్



గంగాజల కలశంతో ఆలయానికి వస్తున్న కటోడ మెస్రం దేవ్‌రావు (ఇన్‌సెట్‌లో ఆలయ ప్రాంగణం గేటు వద్ద ప్రత్యక్షమైన పాము)

31న జిల్లాలో సెలవు : కలెక్టర్

ఉట్నూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి); ఈనెల 31న జరగనున్న కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ సంస్థలకు, కార్యాలయాలకు స్థానిక సెలవు ప్రకటించామని కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నుంచి నాగోబా జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో 31న దర్బార్ ఉందని, అదే రోజు సెలవు ప్రకటించామన్నారు. ఈ సెలవును వచ్చే నెల రెండవ శనివారం రోజున పని రోజుగా భావిస్తామన్నారు. జూనియర్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు ఉన్నందున ఈసెలవు నుంచి మినహాయించాం అన్నారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీవో ఖుష్బుగుప్త

నాగోబా జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఇంద్రవెల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కేస్లాపూర్ నాగోబా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా సూచించారు. మంగళవారం నాగోబా జాతరకు ముఖ్యమైన కూడళ్లలో ఫ్లెక్సీలు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ జాతరలో ఈనెల 31 నాగోబా దర్బార్ ఉంటుందని, ఫిబ్రవరి 4 వరకు జాతర జరుగుతుందని తెలిపారు. జారతలో మత్తు పానియాలు, ప్లాస్టిక్ నిషేధం ఉంటుందని, నడిపే బస్సులకు స్టిక్కర్లు అతికించాలని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన విధులను షిఫ్ట్ వారీగా కేటాయించడం జరిగిందని, వారం రోజుల పాటు జరిగే జాతరలో సంబంధిత అధికారులు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఖుష్బుగుప్త



ఆదిలాబాద్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా ఖుష్బుగుప్త మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ పాలకవర్గ కాలపరిమితి ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్‌లను నియమించింది. దీంతో ఆదిలాబాద్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా ఖుష్బుగుప్త బాధ్యతలను స్వీకరించారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆదివాసీ పెద్దలు

ఖాందేవుడి ఆలయ హుండీ లెక్కింపు

నార్నూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఖాందేవుడి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది. ప్రాంగణంలో తొడసం వంశీయులు ఆదివాసీ పెద్దల సమక్షంలో లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఏడాది ఘనంగా జరిగిన జాతరకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా తైబజార్ రూ.లక్షా 41, 400, ఆలయ హుండీ రూ.80 వేలు, 401 కానుకలు వచ్చినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆదివాసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'బేషరతుగా క్షమాపణ చెప్పాలి'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రజాగాయకుడు గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి బండిసంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం బండి సంజయ్ వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఇందులో గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి సుధాకర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

బోథ్: కేంద్రమంత్రి బండి సంజయ్ వివాదాస్పద మాటలు మాట్లాడడం ఆయన హోదాకు తగదని, ఆయన మాటలు వెనక్కి తీసుకోవాలని జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బత్తుల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

కాంగ్రెస్‌కు.. 'స్థానిక' సవాల్

- జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలపై అధికార పార్టీ నజర్
- మండలస్థాయి నేతలతో ప్రత్యేక సమావేశాలు
- సామాజిక వర్గాల వారీగా ముందే అభ్యర్థుల జాబితా
- నియోజకవర్గాలలో నేతల మధ్య ముదురుతున్న వర్గపోరు
- సమన్వయం కోసం ప్రయత్నాలు చేస్తున్న అధిష్ఠానం





ఆదిలాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై అధికార కాంగ్రెస్ ప్రత్యేకదృష్టి సారిస్తోంది. ఫిబ్రవరిలోనే ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని వార్తలు రావడంతో అధికార పార్టీ నేతలు అప్రమత్తమవుతున్నారు. కానీ నేతల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంటోంది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా.. పార్టీ నేతల మధ్య సమన్వయం, సఖ్యత కుదిరినట్లు కనిపించడం లేదు. దీంతో నేతలంతా కలిసికట్టుగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేస్తారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఖానాపూర్ నియోజకవర్గం మినహా ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు గెలుపొందారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అధికార పార్టీకి స్థానిక పోరులో గెలువడం అంతా సులువేమీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు రావడం ఖాయమని తేలిపోవడంతో అధిష్ఠానం పెద్దలు క్యాడర్‌ను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్ స్థాయి సమావేశాన్ని జిల్లాకేంద్రంలో నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య వర్గపోరు కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితులతో విజయ అవకాశాలు దెబ్బతినే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేల ప్రభావం కొంత ఎక్కువగానే కనిపిస్తుంది. దీనికి తోడు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ఏమేరకు అనుకూలంగా మారుతాయో అంతుచిక్కడం లేదన్న వాదనలు వినిపిస్తున్నా యి.

ఇన్‌చార్జిలకు గెలుపు బాధ్యతలు


స్థానిక సంస్థల ఎన్నికల పై కాంగ్రెస్ పార్టీ ముందుచూపుతో ఉన్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యతలను ఇన్‌చార్జిలకు అప్పగించారు. దీంతో అప్రమత్తమైన ఇన్‌చార్జిలు మండలస్థాయి నేతలతో ప్రత్యేక సమావేశమై మండలాల వారీగా గెలిచే అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేయాలని సూచిస్తున్నారు. మంగళవారం బోథ్ నియోజక వర్గ స్థాయి సమావేశాన్ని నేరడిగొండ మండలంలో నిర్వహించారు. ఈ సమావేశానికి 9మండలాల నుంచి ముఖ్య నేతలంతా హాజరయ్యారు. ఇప్పటికే ఆదిలాబాద్ నియోజకవర్గంలో ముఖ్య నేతల సమీక్ష సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నియోజకవర్గ ఇన్‌చార్జిలకు సవాల్‌గానే మారనున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు ధీటుగా సత్తా చాటాల్సి ఉంటుంది. మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను గెలిస్తేనే పార్టీలో మంచి పలుకుబడి ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఒక్కో స్థానానికి నలుగురు

స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఖరారుకాక ముందే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో నిమగ్నమైంది. దీనికి గాను ప్రతీ మండలం నుంచి సామాజికవర్గాల వారీగా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఏ రిజర్వేషన్ వచ్చినా దీటైనా అభ్యర్థులను బరిలో దించేందుకు సిద్దమవుతున్నారు. ఉదాహరణకు ఒక గ్రామంలో సర్పంచ్ స్థానానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, జనరల్ ఏ రిజర్వేషన్ వస్తే ఎవరిని బరిలోకి దింపాలనేది ముందే అంచనా వేసుకుంటు అభ్యర్థుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. కానీ ఆశావహ నేతల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మండల, గ్రామ స్థాయిలో జాబితాలను సిద్ధం చేయడం తలకు మించిన భారంగా మారుతోందని నేతలు చెబుతున్నారు. కొన్నిచోట్ల ఒకే సామాజికవర్గం నుంచి నాలుగురైదుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకరి పేరును సూచిస్తే మరొకరితో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఎన్నికలకు ముందే పార్టీలో వర్గ విబేధాలకు దారి తీసే అవకాశం లేకపోలేదన్న వాదనలున్నాయి.

తలనొప్పిగా గ్రూపు విబేధాలు

నియోజకవర్గాల్లో నేతల మధ్య గ్రూపు విబేధాలు కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారుతున్నాయి. ఇటీవల నిర్వహించిన పార్లమెంట్‌స్థాయి సమావేశంలో వేదిక పైననే కొందరు నేతలు వర్గ విబేధాలపై తీవ్రంగా మండిపడడం చూస్తుంటే నేతల మధ్య విబేధాలు ఏస్థాయిలో ఉన్నాయో తెలుస్తూనే ఉంది. కొందరు నేతలు మీడియాకు లీకులు ఇస్తున్నారంటూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తీవ్రస్థాయిలో మండిపడడం చర్చనీయాంశంగా మారింది. బోథ్ నియోజకవర్గంలో ఇటీవలే పార్టీలో చేరిన మాజీ ఎంపీ సోయం బాపురావు తన అనుచరులతో ముందుకు వెళ్లే ప్రయత్నం చేయడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు



(తరువాయి 6వ పేజీలో...)

మత్తడిగూడలో సిడాం వంశీయుల పెర్సపేన్ పూజలు



పెర్సపేన్ పూజలు నిర్వహిస్తున్న సిడాం వంశీయులుం

ఉట్నూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్తడి శంభు గూడ గ్రామంలో సిడాం వంశం వారి పేర్సపేన్ మహపూజను ఆదివాసి గిరిజనులు కటొడ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా పుష్య మాసం అమావాస్య రోజున సిడాం వంశీయులు పెర్సపేన్ పూజలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందని గిరిజనులు తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్ర మరియు ఇతర గ్రామాల నుంచి సిడాం వంశం వారు పెరసాపెన్ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా తుమ్మను దేవుని సన్నిధిలో చేర్చారు. కటోడా సిడాం జైతు, పెన్ పటేల్, సిడాం భగవంత్రావు,సిడాం లచ్చు పటేల్, సిడాం లాల్ సావ్ పటేల్, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిడాం జంగుదేవ్ పటేల్, సిడాం వరప్రసాద్ పటేల్, సిడాంవంశీ, దేవు, మనోహర్, జైతు, భీంరావు, ఆనందు పాల్గొన్నారు.

నూతన మండలం ఏర్పాటుతో

వసతుల కల్పనలో అధికారులు

బోథ్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన సోనాల మండలంలో వసతుల కల్పన శరవేగంగా కొనసాగుతుంది. మండలానికి అవసరమైన కార్యాలయాలన్నింటిని అధికారుల సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగానే మంగళవారం ఎంపీడీవో రమేష్ నూతనంగా ఏర్పాటైన సోనాల మండల కేంద్రంలో ఎంపీడీవో నూతన భవనాన్ని పరిశీలించారు. అయితే భవనంలో అవసరమైన సామగ్రిని గ్రామానికి చెందిన దాతలు సమకూర్చారు. అయితే మండల కేంద్రంలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు గత 15 రోజుల క్రితం అధికారులు భవనాలను పాఠశాలలో పరిశీలించి వసతులు ఉన్న గదులను కార్యాలయాలకు సిద్ధం చేశారు. ఈనెల 30న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా మండలం ప్రారంభం కానుంది. దీంతో నూతన మండలంలో అధికారులు పనులు ప్రారంభించనున్నారు. మరోవైపు బోథ్ నుంచే పోలీసు అధికారులు విధులు నిర్వహిస్తారని భావించారు. అయితే జిల్లా అధికారుల నుంచి మంగళవారం ఉదయం నూతన పోలీస్ స్టేషన్ భవనం సహితం ప్రారంభించడం జరుగుతుందని ఆదేశాలకు రావడంతో సాయంత్రం స్థానిక సీఐ వెంకటేశ్వరరావు ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు పోలీస్ స్టేషన్‌కు అవసరమైన గదులను పరిశీలించారు. ఇది ఏమైనా శరవేగంగా మండలంలో నూతన భవనాల ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సీపీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి : పీఆర్‌టీయూ

భీంపూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్, యూపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గంపల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఉష్కం తిరుపతి అన్నారు. మంగళవారం భీంపూర్ తహసీల్దార్ నలంద ప్రియకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు నష్టపోతున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, ఆర్.శ్రీకాంత్, మహేందర్, జంగిలి శ్రీనివాస్, గణేష్ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నేరడిగొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నియోజకవర్గంలో తారు రోడ్డు పునర్నిర్మాణం కోసం రూ.15 కోట్ల మంజూరు చేయించానని మంగళవారం ఆయన అన్నారు. మండలంలోని చిన్న బుగ్గారం, బోరిగాం, తర్నం, బోథ్ మండలంలోని పొచ్చెర, గొల్లపూర్, గుడిహత్నూర్ మండలంలోని సుంకిడి గ్రామాలకు 12 కిలో మీటర్ల తారు రోడ్డు పునర్నిర్మాణానికి రూ.15కోట్ల ముప్పై లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గంలో రోడ్డు లేని గ్రామాలు లేకుండా చూస్తానన్నారు. రోడ్డు పునర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు

నేరడిగొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదిన 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆ రోజు కేంద్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇచ్చినందుకు మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలో డప్పుల చప్పుళ్లతో తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర సీనియర్ నాయకులు గజ్జల శంకర్ మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్షల డప్పుల వెయ్యి గొంతుకుల సమావేశాన్ని విజయవంతం చేయడానికి సిద్ధం కావాలని కోరారు. ప్రతి గ్రామం నుంచి మాదిగ నాయకులు, యువకులు వందలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వారు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోనే ఆడేళ్ళు మాదిగ, గజ్జల అశోక్ మాదిగ, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు చంచు రవి మాదిగ, అధికార ప్రతినిధిగా గజ్జల సంతోష్, సంయుక్త కార్యదర్శిగా ఒడ్డేపల్లి సురేష్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా చిర్ర గంగాధర్, రాజేశ్వర్, గడ్డం మహేందర్, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలు, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలదేవి

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

ఆదిలాబాద్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువు ఎంతో ముఖ్యమో క్రీడాలు కూడా అంతే ముఖ్యమని అదనపు కలెక్టర్ శ్యామల దేవి అన్నారు. మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్సీ వసతి గృహాల విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు.దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి కమ్యూనిటీ సునీత, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, వసతి గృహాల అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుని పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి.ప్రతాప్‌సింగ్ తెలిపారు. గణితం-1 సబ్జెక్టులో ఖాళీ ఉందని అభ్యర్థులు సంబంధిత పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులు ఉన్న వారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉందని, బోధన అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రం సమర్పిస్తే వెయిటేజి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 1లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, 3న జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయని, వివరాలకు సెల్ నెం.7075999789, 9490452742 సంప్రదించగలరని ప్రిన్సిపాల్ తెలిపారు.



ఎంపీకి గంగాజలం అందజేస్తున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

పవిత్ర గంగాజలం అభినందనీయం : ఎంపీ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహా కుంభ మేళకు వెళ్లలేని వారి కోసం పవిత్ర గంగజలం అందించడం అభినందనీయమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎంపీకి గంగజలం అందించారు. పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో జలం రవీందర్, మాధవ్, బీజేపీ నాయకులు రాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ

ఉట్నూర్, జనవరి28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పాండిచ్చేరిలో నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ పెయిర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అభినందించారు. ఈ పాఠశాల విద్యార్థినులు 9వ తరగతికి చెందిన టేకం మౌనిక, 8వ తరగతికి చెందినఆత్రం జ్యోతిక నేచురల్ ఫుడ్‌ఫర్ ప్రిపరేషన్ ఫర ఎనిమియా కార్యక్రమంలో పాల్గొని ప్రతి చూయించినందున అభినందనీయులని అన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

బజార్‌హత్నూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహణ కలిగి ఉన్నప్పుడే ఆమెతో పాటుగ ఆమె కుటుంబం కూడా ఆర్థికంగా నిలదొక్కుకుటుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రహ్లాద్ అన్నారు. మంగళావారం మండలంలోని మహిళా సమాఖ్య సంఘము ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు అర్థిక అక్షరాస్యతపై అవగాహణ కార్యక్రమము నిర్వహించారు. ఇందులో ఏపీఎం గణేష్, ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ, సీసీలు తొట్ల శంకర్, పురుషోత్తం, ఈశ్వర్, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీబీని నిర్మూలించడమే లక్ష్యం

నేరడిగొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): టీబీ మహమ్మారీని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని తేజాపూర్ గ్రామస్తులకు టీబీ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందులో వైద్య సిబ్బంది రవీందర్, సంతోష్, వైష్ణవి, రాణి, శ్రీనివాస్‌రెడ్డి, సాయన్న, భూలక్ష్మీ, గంగామణి, లక్ష్మీ, భానుప్రియ, పుష్పల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారభించిన ఆడె

నేరడిగొండ జనవరి 28(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఈద్గా వద్ద కాలనీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందులో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, జామ మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ వాజీద్, ఉపాధ్యక్షుడు సయ్యద్ సాబీర్, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డైట్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అలరించారు. సినిమా, జానపద పాటలపై నృత్యాలు చేస్తూ హోరెత్తించారు.

ఢిల్లీలో దుబార్‌పేట్ కళాకారుల ప్రతిభ

● గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకున్న డైరెక్టర్ కాత్లే శ్రీధర్



ఇచ్చోడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో పలు రాష్ట్రాల కళాకారులతో నెల రోజుల పాటు నిర్వహించిన జయతి జయమామ భారతం అనే కార్యక్రమంలో ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ కళాకారులు ప్రతిభను చాటారు. ఐదు వేల మంది కళాకారులతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గిన్నిస్ రికార్డు దక్కింది. 5వేల మందితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దుబార్‌పేట్‌కు చెందిన ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం దుబార్‌పేట్ కళాకారులు ఉండటం జిల్లాకు గర్వకారణం. తెలంగాణ రాష్ట్రం తరపున తమ బృందానికి అవకాశం రావడం అదృష్టమని కళాకారుల సంఘం డైరెక్టర్ కత్లే శ్రీధర్ అన్నారు. ఈ అవకాశాన్ని అందించిన భారత సంస్కృతిక శాఖ సెక్రటరీ అరునిష్ చావ్లా సంగీత్‌నాటాక్ ఆకాడమీ డాక్టర్ సంధ్యారాణికి సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఆనంద్, భాస్కర్, నగేష్, గంగారాం, లక్ష్మణ్, సంజీవ్, సాగర్, పరుశురా, విశ్వనాథ్ తదితరులు కళాకారులకు ఈ ప్రదర్శనలను నిర్వహించారు.



ఢిల్లీలో ఆదివాసీ గుస్సాడీ వేషాధారణలో దుబార్‌పేట్ కళాకారులు
(ఇన్‌సెట్‌లో ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్)

రక్త సేకరణలో రిమ్స్ మొదటి స్థానం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రక్త సేకరణలో ఆదిలాబాద్ రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మొదటి స్థానంలో రావడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మొదటి స్థానం పొందిన బ్లడ్ బ్యాంక్ సిబ్బందిని మంగళవారం ఆయన ఛాంబర్‌లో సత్కరించారు. అవార్డుతోపాటు ప్రశంస పత్రాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రిమ్స్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో రిమ్స్‌ని బ్లడ్ బ్యాంకుకు రక్త సేకరణ అయ్యిందన్నారు. దీని కారణంగా రాష్ట్ర స్థాయిలో ఆదిలాబాద్‌కు మొదటి స్థానం రావడం హర్షణీయమన్నారు. ఇదే సిబ్బందికి ముందుకు జాతీయ స్థాయిలో కూడా అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ సుధాకర్, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ రామాదేవి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ సంధ్యారాణి, సునీల్ కుమార్, సతీష్ రెడ్డి, సులేమాన్ పాల్గొన్నారు.

● ఇన్ఫెక్షన్ లేని ఆస్పత్రిగా తయారు చేయడమే లక్ష్యం

ఆదిలాబాద్ రూరల్: ఇన్ఫెక్షన్ లేని ఆస్పత్రిగా రిమ్స్‌ను తయారు చేయడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పని చేయాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం హెచ్‌ఐసీసీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ట్రైనర్ సిమ్మి కుమారి వ్యర్థాల వేరు గురించి నర్సింగ్ సిబ్బందికి ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. ఏ రంగు డబ్బలో ఏ వ్యర్థాలు వేయాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ రిమ్స్ ఎలాంటి ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల కోయంబత్తూర్‌లో జరిగిన సమావేశంలో బయో వెస్ట్‌పై శిక్షణ ఇచ్చారన్నారు. ఇందులో పాల్గొన్న తర్వాత ఇక్కడి సిబ్బందికి కూడా బయో వెస్ట్‌పై అవగాహన కల్పించేలా ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి : తుడుందెబ్బ

ఉట్నూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై ఖానాపూర్‌కు చెందిన ఓ వాట్సాప్ గ్రూప్‌లో, సోషల్ మీడియాలో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఆయనపై వెంటనే కేసు నమోదు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు చరిత్ర ప్రజాస్వామికబద్ధంగా ప్రజలు గెల్పించినటువంటి ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అన్నారు. ప్రజల సమస్యలపై తుడుం దెబ్బ దశ నుంచి పోరాటం చేశారన్నారు. బలహీన వర్గాల కోసం నిరంతరం నిస్వార్థంగా ఎమ్మెల్యేగా కొనసాగుతూ వస్తున్నారన్నారు. అనుచిత పోస్టు పెట్టిన వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొట్నాక భారీక్ రావు, పెందోర్ త్రిమూర్తి,పెందోర్ మధు, మెస్రం మోతిరం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: సామాజిక మాధ్యమం ద్వారా ఖానాపూర్ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన ఆదివాసీ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జిల్లా రాయ్ సెంటర్ అధ్యక్షుడు మెస్రం దుర్గు పటేల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ప్రెస్‌భవన్ లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఓ వ్యక్తి ఎమ్మెల్యేపై విషప్రచారం చేస్తూ ఒక వర్గాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యల పట్ల ఆదివాసీ సమాజం తీవ్ర మనస్థాపానికి గురవుతోందన్నారు. ఇందులో ఆదివాసీ పెద్దలు కోట్నాక్ దేవ్ శావ్, హీరో కొముర జాకు, మడవి ఆనందరావు, కోట్నాక్ బారిక్ రావు, ఆత్రం ప్రేమ్‌దాస్‌లు ఉన్నారు.

ఖోడాద్ వద్ద రోడ్డు ప్రమాదం : ఒకరి మృతి

తలమడుగు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖోడాద్ అంత రాష్ట్ర రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారని ఎస్ఐ అంజమ్మ తెలిపారు. వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్రకు చెందిన శంకర్ షిండే (28) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై మహారాష్ట్ర వైపు వెళుతుండగా మహారాష్ట్ర నుంచి వస్తున్న కేటీసీ సిమెంట్ వాహనం ఖోడాద్ మూలమాలపు వద్ద ద్విచక్ర వాహన ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా మృతుడు మహారాష్ట్రలోని యువతమాల్ జిల్లా హరిని తాలూకా నార్గౌకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కాగా కేటీసీకి సిమెంట్ కంపెనీకి చెందిన వాహనాలు అతి వేగంతో నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. అనంతరం అతివేగంగా నడుస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని. గ్రామస్థులు అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రతిరోజు భారీ వాహనాలు అతి స్పీడుతో వెళ్లడంతో పలు ప్రమాదాలు జరుగుతున్న ఎవరూ పట్టించుకోవడంలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం రాస్తారోకో చెప్పడంతో దాదాపు గంట సేపు వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం అదిలాబాద్ సిఐ ఫణిందర్, ఎస్సై అంజమ్మ సంఘటన స్థలాన్ని చేరుకొని రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులకు నచ్చజెప్పి అతి వేగంగా నడుస్తున్న వాహనాలపై చర్యలు తీసుకొని మృతుని కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు రాస్తారోకోను విరమించారు.

కాంగ్రెస్‌కు 'స్థానిక' సవాల్

(5వ పేజీ తరువాయి...)

వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కంది శ్రీనివాస్‌రెడ్డి కొందరు నేతలను పక్కన పెట్టడంతో ఓ వర్గంగా ఏర్పడి అధిష్ఠానం వద్ద ఆయనకు వ్యతిరేకంగా చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తుంది. అన్ని నియోజకవర్గాల్లోనూ పాత, కొత్త నేతల మధ్య ఆధిపత్యపోరు పెరిగిపోవడంతో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది.

వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులకు గురైతే.. ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్ రావు తెలిపారు. మంగళవారం డీఎల్ఎస్ఏ సమావేశ మందిరంలో కోర్ట్ అధికారులకు, సిబ్బందికి పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నిరోధక నివారణ పరిష్కార చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఇచ్చిన వివరణ మేరకు విచారణ చేపట్టామన్నారు. ఇందులో న్యాయమూర్తులు పి.శివరాంప్రసాద్, ప్రమీల జైన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి, బి.సౌజన్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

తాంసి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తాగుడికి బానిసైన ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పలువురిని కలిచివేసింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సావర్గావ్ గ్రామానికి చెందిన మెరుగు శివాజీ (43) అనే వ్యక్తి గత కొంత కాలంగా తాగుడికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన యువకుడు అక్కడ పాడు బడ్డ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్థులు బావిలో దూకిన యువకున్ని కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీదేవి పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నట్లు ఆమె తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓ టేల(దుకాణం) విషయంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తిపై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో ఓ టేల విషయంలో సంజయ్ నగర్‌కు చెందిన గులాం అక్బర్‌కు ఖానాపూర్‌కు చెందిన ముజాహిద్‌కి వాగ్వాదం జరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో ముజాహిద్ అక్బర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో అక్బర్‌కు గాయాలయ్యాయి. దీంతో అక్బర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు.

● కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్ రూరల్: కూలి పని చేస్తూ ఇద్దరు కూలీలు విద్యుత్ షాక్‌కు గురైన ఘటన చోటుచేసుకుంది.వివరాలు ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్‌పిఎల్ స్కూల్ ఆవరణలో ఇమ్రాన్ అనే కాంట్రాక్టర్ ఇద్దరు కూలీలను పనిలో పెట్టుకున్నారు. కాగా ఆ కూలీలు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. దీంతో బాధిత కుటుంబీకులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు.

రిటైర్డ్ తహసీల్దార్ మృతి

నేరడిగొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ కాడరి రాములు(82) అనారోగ్యంతో మంగళవారం ఆసిఫాబాద్‌లో మృతి చెందారు. ఆయన స్వగ్రామం వడూర్ కాగా, ఆసిఫాబాద్ లో నివాసముంటున్నారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. మృతుని స్వగ్రామమైన వడూర్ గ్రామానికి మృత దేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి

జిల్లా ఇన్‌చార్జి మంత్రులను కలిసిన ఎమ్మెల్యేలు

● బాసర వసంత పంచమి వేడుకలకు రావాలని ఆహ్వానం



కేంద్ర సహాయ మంత్రికలిసి ఆహ్వానం పలుకుతున్న ముథోల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు

ముథోల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ని అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కలను వేరువేరుగా మంగళవారం హైదరాబాద్‌లో ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు కలిశారు. ఈ సందర్భంగా హోంమంత్రితో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ముథోల్, ఆదిలాబాద్ పార్టీ స్థితిగతులపై మంత్రి చర్చించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి అయిన అంజిరెడ్డి గెలుపు కొరకు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ బాసరలో సరస్వతీ అమ్మవారి ఆలయంలో జరగనున్న వసంత పంచమి ఉత్సవాలకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. తప్పకుండా వస్తాను, ఒకవేళ వీలుకాని పక్షంలో మరోసారి బాసరకు వస్తానని మంత్రి పేర్కొన్నారు. అంతేకాకుండా అమ్మవారి ఆలయానికి ప్రసాదం స్కీంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామీని ఇచ్చినట్లు తెలిపారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయిన సీతక్కను ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కలిసి బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో జరుగనున్న వసంతపంచమి ఉత్సవాలకు ప్రత్యేక ఆహ్వానం అందించారు. వసంత పంచమి ఉత్సవాల ఏర్పాట్ల రివ్యూ మీటింగ్ కొరకు మంత్రి సీతక్క రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. ఆలయ ఉత్సవ ఏర్పాట్ల కొరకు ఉత్సవ ప్రాతిపదిక నిధులను కేటాయించాలని కోరడంతో మంత్రి తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారని తెలిపారు. వీరి వెంట బీజేపీ యువ నాయకులు పట్టేపురం సతీష్ రెడ్డి ఉన్నారు.

సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే

తానూర్ మండల కేంద్రం నుంచి మొగిలి మహారాష్ట్ర బార్డర్ హుండా వరకు బీటీ రోడ్డు, నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి పంచాయతీరాజ్‌శాఖ నిధులను మంజూరు చేయించినందుకు ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'కేంద్ర మంత్రి పదవి నుంచి

బండి సంజయ్‌ని వెంటనే బర్తరఫ్ చేయాలి'

ఖానాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోత) : ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌ని వెంటనే కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పి.సమరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా బండిసంజయ్ మతిస్థిమితం కోల్పోయినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. గద్దర్ చేసిన ప్రజాపోరాటాలు తెలియక బండి సంజయ్ ఇష్టారీతిన మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఒక విప్లవవీరున్ని ఉద్దేశించి కేంద్ర మంత్రి బండిసంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉప సంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

'అభివృద్ధిని ఓర్వలేకనే ఎమ్మెల్యే బొజ్జుపై బీఆర్ఎస్ అసత్య ప్రచారం'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ కరీం

ఖానాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ అసత్య ప్రచారానికి తెరలేపిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సయ్యద్ కరీం అన్నారు. మంగళవారం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది కోవర్టులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపై ముస్లిం సమాజాన్ని దూషించారనే విషప్రచారాన్ని చేస్తున్నారని మండిపడ్డారు. ఖానాపూర్ పట్టణంలో భారత తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ విగ్రహ ఏర్పాటు అంశాన్ని తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పట్ల అనుచితంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఎమ్మెల్యేకు కనీసం సమాచారం కూడా లేకుండానే విగ్రహ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారని అది కాస్త రాజకీయం కావడంతో ఆ వివాదంలోకి ఎమ్మెల్యేను లాగేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తుందన్నారు. ఇటీవల ఖానాపూర్‌లో పర్యటించిన సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తనను దూషించిన వ్యక్తిని ఉద్దేశించి మాట్లాడిన మాటలను వక్రీకరించి ఎమ్మెల్యే ముస్లిం సమాజాన్ని దూషించారంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్‌లో భారత తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ విగ్రహం ఎందుకు ఏర్పాటు చేయలేదన్నారు. విగ్రహారాధనకు ఇస్లాం వ్యతిరేకమని అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి ప్రత్యామ్నాయంగా ఆయన మెమోరియల్‌ను ఏర్పాటు చేయాలన్నారు.


పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

ఎమ్మెల్యేను ఉద్దేశించి రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వైరల్ చేసిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సదరు నాయకుడిపై కాంగ్రెస్ మైనారిటీ విభాగం నాయకులు ఖానాపూర్ పోలీస్‌స్టేష న్‌లో ఫిర్యాదు చేశారు. అతడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

భైంసావాసులకు తీరనున్న విద్యుత్ వెతలు

● సబ్‌స్టేషన్‌లో కొత్త 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

భైంసా, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసా పట్టణవాసులు గత రెండున్నర నెలలుగా ఎదుర్కొంటున్న విద్యుత్ వెతలు దూరం కానున్నాయి. సోమవారం ఇక్కడి 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో రెండున్నర నెలల క్రితం దెబ్బతిన్న 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో అదే సామర్థ్యంతో కూడిన కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు జరిగింది. సబ్ స్టేషన్ పరిధిలోని ఏడు ఫీడర్ల సరఫరా కోసం గాను రెండు 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అయితే రెండున్నర నెలల క్రితం సాంకేతిక కారణాలతో ఒక 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. దీంతో రెండున్నర నెలలుగా ఒకే 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా 7 ఫీడర్లకు విద్యుత్ సరఫరా కొనసాగింది. ఈ కారణంగా ఎక్కడ చిన్నపాటి సమస్య ఏర్పడిన పట్టణ పరిధిలోని ఏడు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో రోజుకు మూడు నుంచి నాలుగు పర్యాయాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో పట్టణ విద్యుత్ వినియోగదారులు అవస్థల పాలయ్యారు. సోమవారం కొత్త 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సబ్ స్టేషన్‌కు సరఫరా అయ్యింది. దీంతో ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఈ ఆదిత్య, ఏఈ మోహన్‌లు కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగింప చేసే చర్యలను చేపట్టారు. మంగళవారం నుంచి కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వినియోగంలోకి తీసుకవచ్చి విద్యుత్ సరఫరా అందిస్తామని ట్రాన్స్‌కో అధికారగణం వెల్లడించింది.



కొత్త 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న విద్యుత్ అధికారులు

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

కుంటాల, జనవరి, 28: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూర్ గ్రామంలో మంగళవారం మోహన్‌రావు పటేల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యా ర్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. కల్లూర్ వాసవి హైస్కూల్, కస్తుర్బా పాఠశాల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులందరికి పదవ పరీక్షలకు సిద్ధం కావాలని మోహన్ రావు పటేల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పటేల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తల్లిదండ్రుల ఆశయాల సాధనకు కృషి చేయాలని, క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని, ఉపా ధ్యాయులు నేర్పించే పాఠాలను శ్రద్దతో విని పరీక్షల్లో మంచి మార్కులు సాధిం చాలని సూచించారు. కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు లక్ష్మణ్ పటేల్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయించిన

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన గ్రామస్థులు

తానూర్ , జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలూర్, కోలూర్ తండా, మసాల్గా తండా, మొగ్గిలి గ్రామాల ప్రజల చిరకాల వాంఛ అయిన తానూర్ నుండి మొగిలి మహారాష్ట్ర బార్డర్ అయిన హుండా వరకు బీటీ రోడ్డును మంజూరు చేయించడం పట్ల మంగళవారం మొగిలి గ్రామస్థులు ఎమ్మెల్యే రామరావుపాటిల్‌కు దన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు పుంద్ర లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రోడ్డు మంజూరి చేయించడం అభినందనీయం, అదే విధంగా కోలూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరి చేయించిన ఎమ్మెల్యే రామరావుపాటిల్‌కు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాదవ్ వివాజీరావుపాటిల్, మాజీ సర్పంచ్ మారుతి, బాలాజీ, ఎల్లప్ప, మాధవ్‌రావు, ఆయా గ్రామాల ప్రజలు నాయకులు, కార్యకర్తలున్నారు


దశాబ్దాల కల నెరవేరే వేళ..



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మండల అధికారులు

సోన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ నిధుల ద్వారా ఆయా వార్డుల్లో సీసీ, పక్కా డ్రైన్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా మురికి కాలువలు లేకపోవడంతో ఇంటిలోని నీరు రోడ్డుపై ప్రవహించడంతో రహదారిపై నడిచే గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చొరవతో కొన్ని పనులు ప్రారంభమై చివరిదశకు చేరడంతో మంగళవారం మండల అధికారులు పదవవార్డులో డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో షేక్ కలీం, పీఆర్ అండ్ ఏఈ సాయివర్ధన్, సెక్రటరీ కొరిపెల్లి భూపాలరెడ్డి, మాజీ సర్పంచ్ అంకం గంగామణి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఏ. నాగయ్య, బీజేపీ దళిత జిల్లా మోర్చా ప్రెసిడెంట్ రాచకొండ సాగర్, తదితరులు ఉన్నారు.

గంజాల్ టోల్ ప్లాజా కార్మికులకు సంఘీభావం



ఆందోళన చేస్తున్న గంజాల్ టోల్ ప్లాజా కార్మికులు

సోన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా కార్మికులకు బీఆర్ఎస్ జిల్లా నాయకులు మంగళవారం సంఘీభావం తెలిపారు. జిల్లా సమన్వయకర్త కే.రాంకిషన్‌రెడ్డి గంజాల్ టోల్ ప్లాజా వద్దకు చేరుకొని ఆందోళన చేసుకున్న కార్మికులకు న్యాయం జరిగే వరకు వారికి తోడు ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, నహీం, జుబేర్ ఖాన్, రిజ్వాన్ ఖాన్, నజీరుద్దీన్, ప్రకాష్, రాజేశ్వర్, రాజు, ఫహీం, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక సహాయం

ముథోల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్ట గ్రామంలో గత మూడు రోజుల క్రితం మద్యం కొరకు తల్లి పెన్షన్ డబ్బులను ఇవ్వాలని అడగడంతో తల్లి డబ్బులు ఇవ్వకుంటే తల్లిని హత్య చేసిన విషయం విధితమే. అయితే నిందితుడు గజ్జన్న జైలుకు వెళ్లడంతో అతని పిల్లలు అనాధలుగా మారిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆష్ట గ్రామాన్ని సందర్శించారు. అనాదలైన పిల్లలకు బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త డా. కిరణ్ తనవంతు సహాయంగా రూ. 10 వేలు ఆర్థిక సహాయం చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

లోకేశ్వరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాపూర్, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో మంగళవారం బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి అధ్యక్షులు కే కిరణ్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మీకోసం



పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

పంచ సూత్రాలు పాటిద్దాం..

పదిలో మెరుగైన ఫలితాలు సాధిద్దాం

- పదో తరగతి పరీక్షలపై ఆందోళన వద్దు
- ప్రణాళికతో సన్నద్ధమైతే విజయం తథ్యం

భైంసా, జనవరి28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను మార్చి 21 నుంచి నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ సమయంలో పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తే విజయం వస్తుంది. పంచ సూత్రాలు పాటిస్తే సత్ఫలితాలు సాధించే అవకాశాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు కలిపి మొత్తం 235 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో నుంచి బాలికలు 4,442 బాలురు 4,685 మంది కలిపి మొత్తం 9,127మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు,

ధోరణి: విద్యార్థుల మానసికస్థితి బాగుండాలి. పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో ఎలాంటి ఆందోళనకు గురికావొద్దు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. సందేహాలను ఉపాధ్యాయుల వద్ద నివృత్తి చేసుకోవాలి. బృంద చర్చలకు ప్రాధాన్యమివ్వాలి.

నమ్మకం: ఆయా సబ్జెక్టులపై పట్టు సాధించాలి. తమపై తనకు నమ్మకం ఉండాలి. ఏదైనా సాధించగలుగుతాననే ధీమా ఉంటే లక్ష్య సాధనకు అడ్డంకులు తొలుగుతాయి. అవాంతరాలన్నీ అధిగమించే దిశగా ముందుకు సాగాలి.

ఏకాగ్రత: పాఠ్యాంశాల్లో పూర్తిస్థాయిలో రాణించడానికి ఏకాగ్రత అవసరం. ఇందుకు నిత్యం ధ్యానం చేయాలి.మనోధైర్యంతో వ్యవహరిస్తూ ప్రణాళికబద్ధంగా పరీక్షలకు సిద్ధమవ్వాలి..

క్రమశిక్షణ: పరీక్షల వేళ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు శ్రద్ధచూడాలి. ఫోన్, టీవీలను దరిచేరనీయొద్దు. ఇప్పుడు శ్రమిస్తే భవిష్యత్తు బాగుంటుందనే విషయాన్ని గుర్తించాలి.

దృష్టి: విద్యార్థులంతా దృష్టంతా చదువుపై కేంద్రీకరించాలి. దీనికి అధ్యాపకులు, కుటుంబీకులు తోడ్పాటునందించాలి. అనుకూల వాతావరణం కల్పించాలి. కఠిన అంశాలపై పట్టు పెంపొందించుకోవాలి. సులువైనవి చివరకు చదవాలి. అన్నింటిని ఎక్కువ సార్లు మననం చేసుకోవాలి.

లక్ష్యం అధిగమించేంత వరకూ విశ్రమించొద్దు

- వాడేకర్ లక్ష్మణ్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు



విద్యార్థులు లక్ష్యం అధిగమించేంత వరకూ విశ్రమించొద్దు. సమయపాలన ప్రధానం. పరీక్షలు పూర్తయ్యే వరకు వ్యాపకాలకు దూరంగా ఉండాలి. చదువే సర్వం అనుకుని ముందుకు సాగాలి.ప్రణాళికతో పయనిస్తే ఆశించిన ఫలితాలు సాధించడం ఖాయం.

సానుకూల దృక్పథంతో సాగాలి



- బల్స గజ్జారాం, గణిత ఉపాధ్యాయుడు, బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల, నిర్మల్

గణితంలో సూత్రాలు గుర్తుపెట్టుకోవాలి. పరీక్ష వేళ మంచి అంశాలను స్వీకరించాలి. సానుకూల దృక్పథంతో మెలగాలి. ఆందోళనలు, అపోహలు వీడి ఆత్మస్థైర్యంలో పరీక్షలకు సిద్ధమవ్వాలి.

ప్రశాంతత అవసరం

- రామారావు, డీఈవో, నిర్మల్



పరీక్షల వేళ ప్రశాంతత అవసరం. సమయ సారణి రూపొందించుకొని అందుకు అనుగుణంగా చదువుకోవాలి. కష్టపడి కాకుండా ఇష్టపడి పాఠ్యాంశాలు చదవాలి. ఇతర అంశాలపై దృష్టి మరల్చొద్దు. ప్రణాళికతో పరీక్షలకు సిద్ధమవుతే సత్ఫలితాలు సాధ్యమే.



నాగోబా ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు



సంప్రదాయ వాయిద్యం కిక్రి వాయిస్తున్న మెస్రం వంశీయులు

మెస్రం వంశీయుల మహాపూజలతో

నాగోబా జాతర ప్రారంభం

- 30న పెర్సాపేన్, బాన్‌పేన్‌లకు పూజలు
- 31న నాగోబా దర్బార్
- 1న బేతాల్‌పూజ, మండగాజలింగ్‌తో ముగింపు

ఇంద్రవెల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం, రాష్ట్రపండుగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా దేవతకు ప్రతియేటా పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఆదివాసీలు అత్యంత వైభవంగా నిర్వహించే మెస్రం వంశీయుల మహాపూజలతో నాగోబా జాతర మంగళవారంరాత్రి ప్రారంభమైంది. ఆదివాసీ గిరిజనులు ముఖ్యంగా మెస్రం వంశీయులు తమ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ నాగోబా సన్నిధిలో పవిత్ర గోదావరి జలాలతో నాగోబా దేవతను ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు, మెస్రం వంశీయులు పూజారీ(కటోడ) మెస్రం దేవ్‌రావు, మెస్రం కోసురావు ఆధ్వర్యంలో ఆచార వ్యవహారాలతో పూజలు నిర్వహించారు. మంగళవారం మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర వేడుకలు ఫిబ్రవరి 4 వరకు కొనసాగనున్నాయి. మంగళ వారం అర్ధరాత్రి బేటింగ్ (కొత్త కోడళ్ల పరిచయం), భక్తుల దర్శనం, ప్రత్యేక పూజలు, 30న ఆదివాసీ దేవుళ్ల పెర్సాపేన్, బాన్‌పేన్‌లకు పూజలు చేయనున్నారు. 31న దర్బార్ నిర్వహించనున్నారు. రాష్ట్ర మంత్రు లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఫిబ్రవరి 1న బేతాల్‌పూజ, మండగాజలింగ్ (ముగింపు కార్యక్రమం)తో జాతర ముగుస్తుంది. పవిత్ర గంగాజలంతో మూడురోజులుగా మర్రిచెట్ల వద్ద బస చేసిన మెస్రం వంశీయులు మంగళవారం ఉదయం ఆదివాసీ గిరిజన సంప్రదాయ వాయిద్యాలతో కేస్లా పూర్‌లోని పురాతన (మురాడి) నాగోబా ఆలయానికి చేరుకొని సంప్రదాయ పూజలుచేశారు. పురాతన నాగోబా విగ్రహంతోపాటు వెలిగించిన దీపాలను వెదురుబుట్టలో పట్టుకొని శోభాయాత్రగా ఆలయానికి బయల్దేరారు. ఆలయానికి చేరుకొని షైసమ్మ దేవతకు పూజలుచేశారు. అనంతరం పురాతన నాగోబా విగ్రహాలతోపాటు నాగోబా దేవత, సతీదేవత, భాన్‌దేవతలకు సంప్రదాయ పూజలుచేసి పురాతన విగ్రహాన్ని గర్భగుడిలోని నాగోబా విగ్రహం వద్ద ఉంచారు. ఆలయం వెనుకున్న భాన్‌దేవతలతోపాటు పెర్సపేన్‌కు పూజలుచేసి మళ్లీ ఆలయంలోకి ప్రవేశించారు. ఆడపడుచులు తెచ్చిన నీటితో మట్టిని కలిపి పుట్టలను తయారు చేశారు. తయారు చేసిన పుట్టల నుంచి మట్టిని ఉండల రూపంలో తీసుకుని ఏడు వరుసలతో బౌలదేవత ను తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజల్లో మెస్రం వంశీయులకు నాగోబా చరిత్రను కిక్రి వాయిస్తు పాటల ద్వారా వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన మెస్రం వంశీయులు, కొత్తకోడళ్ల రాకతో ఆలయప్రాంగణం కోలాహలంగా మారింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, మెస్రం చిన్నుపటేల్, బాదిరావ్ పటేల్, లిం బారావ్‌పటేల్, జంగుపటేల్, కటోడ మెస్రం కోసేరావు, పర్ధాంజీ మె స్రం దాదారావు, కోత్వాల్ మెస్రం తిరుపతి, హనుమంత్‌రావ్, కోశ రావు, మెస్రం వంశీయులు మనోహర్, దేవ్‌రావు, సోనేరావు, నాగ్ నాథ్, శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ వాయిద్యం వాయిస్తున్న మెస్రం వంశీయులు

మహాపూజలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కేస్లాపూర్ నాగోబా దేవతకు మంగళవారం అర్ధరాత్రి రాత్రి 12 తర్వాత చేపట్టిన మహా పూజలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ట్రైనీ కలెక్టర్, అభిగ్యాన్ మలవియా, ఉట్నూర్ ఏఎస్పీ, కాజల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, తదితరులు నాగోబా దర్శనం చేసుకున్నారు.



కోనేరు నుంచి నీటిని తీసుకుని వస్తున్న మహిళలు



మెస్రం వంశం కోడళ్లకు కుండలను పంపిణీ చేస్తున్న దృశ్యం





కోనేరు వద్ద పూజలు చేసి మట్టికుండలో నీటిని నింపుతున్న మెస్రం వంశీయులు అల్లుడు



సతి దేవతల బొలను తయారు చేస్తున్న మెస్రం వంశీయులు మహిళలు

భక్తి



పల్లకీ ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న భక్తులు

కదిలింది శ్రీసాయి పల్లకీ

- ఖానాపూర్‌లో ఘనంగా సాయినాథుడి పల్లకీ ఊరేగింపు
- వైభవంగా సాగుతున్న శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ వార్షికోత్సవ వేడుకలు

ఖానాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓంసాయి.. శ్రీసాయి.. జయ జయసాయి నినాదంతో ఖానాపూర్ పట్టణం మార్మోగింది. పట్టణ శివారులోని శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ 28వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈవేడుకల్లో భాగంగా మంగళవారం ఖానాపూర్‌లో సాయిబాబా పల్లకి ఊరేగింపును కన్నుల పండువగా నిర్వహించారు. ఈ పల్లకీ ఊరేగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలయ కమిటీ అధ్యక్షులు అంకం రాజేందర్ ప్రారంభించారు. పల్లకీ ఊరేగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని పలువురు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ పల్లకీ ఊరేగింపు సాయిబాబా ఆలయం నుంచి ఉత్తర వాహిని గోదావరినది తీరం వరకు గోదావరి నది తీరం నుంచి సాయి బాబా ఆలయం వరకు సాగింది. గోదావరి నదిలో ఆలయంలోని ఉత్సవ విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం నదీతీరంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పల్లకి ఊరేగింపు ప్రక్రియలో భక్తి పరవశంతో భక్తులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పల్లకీ ఊరేగింపును ప్రారంభిస్తున్న దృశ్యం



నది వద్ద పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ


తక్కువ యూరియాతో మొక్కజొన్న సాగు

- మొక్కజొన్న పంట క్షేత్రాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారి



మొక్కజొన్న పంట క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్

సోన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్దులకుంట గ్రామంలో తక్కువ యూరియాతో మొక్కజొన్న సాగుచేస్తున్న రైతు కనకాపురం ముత్యంరెడ్డి పంటక్షేత్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతు అనుభవాలు తెలుసుకున్నారు. ఎకరాకు కేవలం 3 బ్యాగులు రెండు దఫాలు వేసినట్లు చెప్పారు. మొక్కజొన్న బోదెల మధ్య దూరం 50 సెంటీ మీటర్లు ఉంచడం వల్ల సాళ్ల మధ్య సూర్యరశ్మి పడడంతో యూరియా తక్కువ వినియోగం వల్ల దోమ, పంట నష్టపరిచే పురుగుల ఉధృతి చాలా తక్కువగా ఉన్నట్టు గమనించారు. అలాగే ఎకరాకు 45 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేస్తున్నట్లు రైతు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ యూరియాను ప్రతీ రైతు తగ్గించాల్సిన అవసరం చాలా ఉందని, పర్యావరాన్ని రక్షించడమే కాకుండా నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరగాలంటే యూరియా వినియోగం తగ్గించి జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. దీనివల్ల నేలలో పంటపై మిత్ర పురుగులు పెరిగి నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఏఈలు అశోక్ కుమార్, ప్రగతి, రైతులు ఉన్నారు.





బాసర ఆలయ అభివృద్ధిపై నిండా నిర్లక్ష్యం!

గత ప్రభుత్వహయాంలో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అల్లోల (ఫైల్)

అభివృద్ధి పనులపై ప్రణాళికను ఎమ్మెల్యే రాంరావు పటేల్‌కు వివరిస్తున్న దేవాలయ అధికారి (ఫైల్)

- మాస్టర్ ప్లాన్‌ను విస్మరించిన గత ప్రభుత్వం
- ప్రస్తుత సర్కారుదీ అదే ధోరణి
- పైగా గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లు వెనక్కి తీసుకున్న వైనం
- ఇప్పటికీ వర్తించని 'ప్రసాద్' స్కీం
- ఆలయ అభివృద్ధిపై ఆందోళనకు సిద్ధమవుతున్న ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్

నిర్మల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జిల్లాలోని బాసర సరస్వతీ ఆలయ అభివృద్ధిపై నిండా నిర్లక్ష్యం కొనసాగుతోంది. గత రెండు దశాబ్దాల నుంచి బాసర ఆలయాన్ని అభివృద్ధి చేస్తామంటున్న పాలకులు.. ఆ మాటను విస్మరిస్తూ ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బాసర సరస్వతీదేవి ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తన హామీని కాగితాలకే పరిమితం చేసింది. మొదట్లో బాసర ఆలయ అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేస్తామని, ఇందుకోసం రూ.50 కోట్లను మంజూరు చేస్తున్నట్లు అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా ఈ నిధుల్లో నుంచి రూ.8కోట్ల వ్యయంతో ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ తర్వాత మిగిలిన నిధులు రూ.42కోట్లతో పూర్తిస్థాయిలో పనులు చేపట్టాల్సి ఉండగా.. ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా పని చేసిన ఇంద్రకరణ్‌రెడ్డి జిల్లాకు చెందిన వారే అయినప్పటికీ.. ఆయన సైతం ఆలయ అభివృద్ధిని పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. అనేక ఆలయాల అభివృద్ధికి, నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినప్పటికీ.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ ఆలయ అభివృద్ధిపై మాత్రం అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పెద్దగా ఆసక్తి చూపలేదన్న ఆరోపణలున్నాయి. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ.. బాసర ఆలయ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేయగా.. మిగిలిన రూ.42 కోట్ల నిధులను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. దీంతో చాలా మంది ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు, స్థానికులు ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలంటూ ప్రభుత్వానికి విన్నవించారు. అయినప్పటికీ అటువైపు నుంచి స్పందన మాత్రం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క బాసర ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు విడుదల చేస్తామంటూ ఇటీవల ప్రకటించారు. మంత్రి ప్రకటనతో భక్తుల్లో మళ్లీ ఆశలు రేకెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా.. బాసర ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రసాద్' స్కీంలోకి చేర్చే విషయమై కూడా ఇప్పటి వరకు స్పష్టత రావడం లేదు. ఇప్పటికైనా బాసర ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చాలని, అలాగే బాసర ఆలయాభివృద్ధికి అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని భక్తులు కోరుతున్నారు.



నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాంరావు పటేల్‌కు హామీ ఇస్తున్న ఇన్‌చార్జి మంత్రి

● ఆందోళనకు సిద్ధమవుతున్న ముథోల్ ఎమ్మెల్యే

బాసర ఆలయాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం రూ.50 కోట్ల నిధులను మంజూరు చేస్తామంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నిర్మల్ జిల్లా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ డిమాండ్ చేస్తున్నారు. మరో నెల రోజుల్లోగా బాసర ఆలయాభివృద్ధిపై సర్కారు నుంచి స్పష్టమైన ప్రకటన రాని పక్షంలో తానే స్వయంగా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతానని ఆయన హెచ్చరిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేవలం హామీలకే పరిమితం అవుతూ పవిత్ర పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీదేవి ఆలయాభివృద్ధిని పట్టించుకోవడం లేదని రామారావు పటేల్ మండిపడుతున్నారు. ప్రతి రోజూ వేలాది మంది భక్తులు దర్శనం చేసుకునే బాసర ఆలయాన్ని ప్రభుత్వం విస్మరించడం శోచనీయమంటున్నారు. హిందూ ఆలయాల అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలదీ ఒకే విధానం కొనసాగుతుందని ఎమ్మెల్యే రామారావు పటేల్ విమర్శిస్తున్నారు. ఇక బాసర ఆలయాభివృద్ధి విషయమై కార్యకర్తలతో పాటు సరస్వతీ దేవి భక్తులతో కలిసి ప్రత్యక్ష ఆందోళన చేపట్టేందుకు త్వరలోనే కార్యాచరణ రూపొందించనున్నట్లు ఎమ్మెల్యే రామారావు పటేల్ సన్నద్ధమవుతున్నారు.

● మంత్రి సీతక్క మాట నిలబెట్టుకోవాలి

బాసర సరస్వతీ దేవి ఆలయాభివృద్ధికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క రూ. 50 కోట్లు మంజూరు చేస్తానంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన రూ.50 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆ నిధులను వెనక్కి మళ్లించిందని భక్తులు పేర్కొంటున్నారు. మంత్రి సీతక్క బాసర ఆలయాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. అలాగే బాసర ఆలయాభివృద్ధికి గతంలో చేసిన ప్రకటనకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలంటున్నారు.

● వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే నిరాహార దీక్షకు దిగుతా



పవార్ రాంరావు పటేల్ (ముథోల్ ఎమ్మెల్యే)

చదువుల తల్లి క్షేత్రమైన బాసర సరస్వతి దేవీ ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ కాగితాలకే పరిమితమైంది. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించక పోతే బాసర మాస్టర్ ప్లాన్ కోసం తప్పకుండా నిరాహార దీక్షకు దిగుతా..

ప్రైవేటు సంస్థకు లడ్డు తయారీ బాధ్యతలు

● ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న లడ్డు తయారీ కార్మికులు

బాసర, జనవరి, 28 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి దేవస్థానంలో లడ్డు తయారీ బాధ్యతలను ఒక ప్రైవేటు సంస్థకు దేవాదాయ శాఖ అప్పగించింది. ఇప్పటి వరకు దేవస్థానం ఆధ్వర్యంలోనే ప్రసాదాల తయారీ కొనసాగింది. తయారు చేసేందుకు ఒక్కో లడ్డుకు రేటు ఇచ్చి ప్రైవేటు సంస్థకు అప్పగించారు. కాంట్రాక్టు పొందిన సంస్థ మంగళవారం పనులను చేపట్టింది. ఏడాది పాటు ఈ కాంట్రాక్టు ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే గత 30 ఏళ్ల నుంచి ఔట్‌సోర్సింగ్ పద్దతిన పనిచేస్తున్న కార్మికులు ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే పని నుంచి తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఉపాధి దేవాలయ అధికారులు చూయించాలని డిమాండ్ చేశారు.

బ్యాంక్‌లో ఖాతా తెరిచేందుకు రైతు వేదికలో క్యాంప్



ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతా ఓపెన్ చేసి ఇస్తున్న అధికారులు

సోన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ క్లస్టర్ రైతుల సౌకర్యార్థం రైతువేదికలో క్యాంప్ ఏర్పాటు చేశారు. పీఎం కిసాన్‌తో పాటు ఉపాధి హామీ, పెన్షన్లు కేంద్ర ప్రభుత్వ పథకాలకు పోస్టల్ అకౌంట్ లింక్ అవుతున్న సందర్భంలో పోస్టల్ సర్వీస్ చాలా సౌకర్యంగా ఉంటుంది. అలాగే అతి తక్కువ ప్రీమియంతో ఇన్సూరెన్స్ చేసుకునే వెసులుబాటు ఉంది. కాబట్టి ప్రతీ ఒక్కరైతు, కూలీ పని చేసేవారు అకౌంట్ కలిగి ఉండాలని, పెద్ద మొత్తంలో మాదాపూర్, పాక్‌పట్ల, పోచంపాడ్, లోకల్ వెల్మల్ రైతులు ఈ సందర్భంగా ఖాతాలు తెరిచారు. ముషారప్ కస్టమర్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణ అధి కారి అశోక్ పర్యవేక్షణలో ఖాతాదారులకు డిజిటల్ కార్డులు పంపిణీ చేశారు. క్యాంప్ బుధవారం కూడా యధావిధిగా కొనసాగుతుంది. ప్రతి ఒక్కరూ ఈ సర్వీస్‌ను వినియోగించుకోవాలని, మాదాపూర్ క్లస్టర్ అని కాకుండా ఇతర క్లస్టర్ రైతులు కూడా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి.

ఘనంగా లాలా లజపతిరాయ్ జయంతి



కుంటాల, జనవరి, 28 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతి నికేతన్ పాఠశాలలో మంగళవారం లాలా లజపతిరాయ్ జయంతిని నిర్వహించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం అంకితభావంతో పనిచేయాలని న్యాయవాద వృత్తిని విడిచిపెట్టారని ప్రిన్సిపల్ సంతోష్ అన్నారు. కుల, లింగ బేధం లేకుండా ప్రతి ఒక్కరు వేదాలు చదవడానికి, నేర్పించేందుకు అనుమతించాలని ఆయన తెలిపారని డైరెక్టర్ ప్రవీణ్ అన్నారు.

కలప పట్టివేత



సారంగాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల మహావీర్ తండాలో మంగళవారం అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జాదవ్ బలరాం ఇంట్లో అక్రమంగా 13 కలప దుంగలు నిల్వ ఉంచినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ అధికారులు రామకృష్ణరావు, నజీర్‌ఖాన్‌లు తెలిపారు. 13 కలప దుంగల విలువ సుమారు 9 వేలు ఉంటుందని పేర్కొన్నారు. దీంతో అటవీప్రాంతం నుంచి అక్రమంగా కలపను తీసుకువస్తే కఠిన చర్యలు ఉంటాయని తండా వాసులతో పేర్కొన్నారు. ఈ దాడుల్లో అటవీశాఖ సిబ్బంది సంతోష్ కుమార్, సుజాత, స్రవంతిలు ఉన్నారు.

ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్ బదిలీ

ఖానాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శివరాజ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఖానాపూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శివరాజ్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. కడెం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాతరెడ్డిని ఖానాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఖానాపూర్‌కు నూతనంగా బదిలీ అయిన తహసీల్దార్ సుజాతరెడ్డి మంగళవారం విధుల్లో చేరకపోవడంతో తాను ఖానాపూర్ నుంచి ఇంకా రిలీవ్ కాలేదని శివరాజ్ తెలిపారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

పెంబి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుల్గంపాండ్రి గ్రామంలో పెంబి ఫారెస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం గిరిజనులకు ఎఫ్ఆర్‌వో రమేష్ దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అటవీ జంతువులను వేటాడితే కఠినచర్యలు ఉంటాయన్నారు. పంట పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చవద్దన్నారు. ఎవరైనా అమర్చితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో సుందర్, ఎఫ్‌బీవో కిరణ్, ఆశిష్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన

సోన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ కిషోర్ స్వస్తి కార్యక్రమం (ఆర్‌కేఎస్‌కే)లో భాగంగా ఆరోగ్యశాఖ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా హెల్త్ కౌన్సిలర్ డి. లావణ్య మాట్లాడుతూ... ప్రతి ఒక్క విద్యార్థి పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని, తత్ఫలితంగా ఎన్నో వ్యాధులు రాకుండా కాపాడుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

పునరావాస గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామంలో పునరావాసితులైన మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజలకు అన్ని రకాల మౌళిక వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పునరావాస గ్రామాల ప్రజలకు కల్పిస్తున్న వసతులపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పునరావాసం పొందిన ప్రజలకు కేటాయించిన వ్యవసాయ భూములను సాగుకు యోగ్యంగా మార్చాలని ఆదేశించారు. పనులకు సంబంధించిన సమాచారాన్ని శాఖల వారీగా సమీక్షించారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామస్థులకు కల్పిస్తున్న అన్ని మౌలిక వసతులను అత్యంత నాణ్యవంతంగా చేపట్టాలన్నారు. గ్రామస్థుల పంట భూములకు సంబంధించి రెవెన్యూ పట్టాల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మిగిలిన పనులన్నీ వెంటనే పూర్తి చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌లు, జిల్లా అటవీ శాఖ అధికారి నాగిని భాను, ఆర్డీవో రత్నకల్యాణి, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని పెంచుకోవాలి

విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకొని పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ, శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పదవ తరగతి విద్యార్థులు భయం వీడి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. పరీక్షలకు రానున్న రెండు నెలలు కీలకమని, సమయం వృథా చేయకుండా మీ కలలను నిజం చేసుకోవడానికి కృషి చేయాలని కోరారు. ఇప్పటికై సిలబస్ పూర్తయినందున ప్రత్యేక తరగతులకు వంద శాతం విద్యార్థులు హాజరు కావాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను సంబంధిత ఉపాధ్యాయులు నివృత్తి చేయాలని సూచించారు. గత సంవత్సర 10వ తరగతి ప్రశ్న పత్రాలను పరిశీలించి, ప్రశ్నలకు జవాబులు రాయడం, చదవడం ప్రాక్టీస్ చేయాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మీకు అండగా ఉంటారని, చదువులో క్రమశిక్షణను పాటిస్తూ నిబద్ధతతో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని, మానసిక శక్తిని కాపాడుకోవాలని, ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించి, జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని సూచించారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా యంత్రాంగం ప్రోత్సాహకాలను అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల తీరును అధికారులు, ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, రాజేశ్వర్‌గౌడ్, వార్డెన్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో ఆకస్మికంగా పర్యటించిన డీఈవో

● వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు బోధించాలని సూచన



వడ్యాల్ ప్రభుత్వ పాఠశాల ప్రార్థనలో పాల్గొన్న జిల్లా విద్యాధికారి రామారావు



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

లక్ష్మణచాంద, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాధికారి రామారావు మంగళవారం మండలంలోని వడ్యాల్‌లో ఆకస్మికంగా పర్యటించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలకు ఉదయం 8:30 గంటలకే వచ్చి ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలియటంతో లేటుగా వచ్చే వారంతా ఉరుకులు పరుగులు పెట్టి పాఠశాలకు హాజరయ్యారు. కొందరైతే చేసేదేమీ లేక సెలవులు పెట్టినట్లు సమాచారం. ఈ సందర్భంగా స్థానిక విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన ముచ్చటించారు. చదువులో వెనుకబడిన 10వ తరగతి విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. ప్రతి రోజు ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయులు కూడా హాజరు కావాలని, విషయాల వారీగా రాబోయే పరీక్షలకు సన్నద్ధం చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ఉపాధ్యాయులు వెనువెంటనే నివృత్తి చేస్తూ, విద్యార్థులందరూ 100 శాతం ఉత్తీర్ణులు అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల వారు విద్యార్థుల ఆధార్‌లను అప్డేషన్ చేసి అపార్‌లో వివరాలు నమోదు చేయాలి. మన జిల్లాను అపార్‌లో మొదటి స్థానంలో ఉంచేలా చూడాలని కోరారు. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుందని తెలియజేశారు. పాఠశాలకు గైర్హాజరు అయ్యే పిల్లల విషయంలో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు, పోషకులతో తరచూ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతి వివరాలు తెలియజేయాలని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలు విద్యాశాఖసూచనల ప్రకారం నిక్షిప్తం చేస్తూ అందుబాటులో ఉంచాలన్నారు. 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడాలని, విషయాల వారీగా విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించి వెనుకబడిన పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతిరోజు వాళ్లతో సంభాషించాలన్నారు. ప్రతి విద్యార్థికి సంబంధించి చరవాణి నెంబర్ పాఠశాలలో నమోదై ఉండాలని, విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని వారి విద్యాభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలన్నారు. గత వార్షిక ప్రశ్న పత్రాలతో విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించాలని చెప్పారు. సబ్జెక్టు ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని, గ్రాండ్ టెస్టులు 1, 2, ప్రీ ఫైనల్ పరీక్షలకు పిల్లలను సన్నద్ధంచేసి పరీక్షలను సులభంగా రాసేలా తీర్చిదిద్దాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఉపాధ్యాయులందరూ పాఠశాలకు ప్రతిరోజు హాజరు కావాలని కోరారు. పదవ తరగతి విద్యార్థిని విద్యార్థుల నోట్ బుక్స్ ఫార్మేటివ్, సమ్మేటివ్ జవాబు పత్రాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో గల కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. తాగునీటి వసతి సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థులు వినియోగించే మూత్రశాలలను, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల పరిశుభ్రత కార్మికులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్. అశోక్ వర్మ, జిల్లా విద్యాశాఖ సైన్స్ అధికారి వినోద్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నిర్మల్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం రోజు జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్, లక్ష్మీ కావేరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి ఉచిత శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రవికుమార్ రెడ్డిలు మాట్లాడారు. ఆర్టీసీఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ ఆరోగ్యంగా ఉంటుందని, మానవ శరీరంలో అన్ని అవయవాల కంటే కళ్లు చాలా ముఖ్యమైనవి, ముఖ్యంగా ఆర్టీసీ డ్రైవర్‌కు కళ్లు బాగుంటేనే ఎదురుగా వస్తున్న వాహనాలు స్పష్టంగా కనబడతాయన్నారు. దూరపు చూపు, దగ్గర చూపు బాగుండాలని, అవసరమైన సైట్‌కు సంబంధించిన కళ్లద్దాలు వాడాలని సూచించారు. సుమారు 81 మంది ఆర్టీసీ ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్లు ఐ.రాజశేఖర్, నవీన్‌కుమార్, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ చంద్రమోహన్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మీనారాయణగౌడ్, ప్రోగ్రామర్ శంకర్‌రావు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన సదస్సు



కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ ప్రతినిధి

దిలావర్‌పూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విడ్స్ స్వచ్ఛంద సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకులు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, వాటి వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కృష్ణ, సీనియర్ అధ్యాపకులు ఆనందం, విడ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు భరత్, యోగేష్ పాల్గొన్నారు.